JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 25-08-2026
Medchal - Malkajgiri । Tuesday 25-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 85
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 85 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com






# కేంద్రం తీరుపై తెలంగాణ ఆగ్రహం!

*వికసిత్ భారత్ 2047లో భాగంగా తమ వంతుగా కృషి చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇటీవల తన యూకే పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, దురదృష్టవశాత్తూ అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించిందన్నారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలు, రోడ్ షోలకు అనుమతిచ్చి.. తెలంగాణ సీఎంను మాత్రం అడ్డుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇది నాకు జరిగిన అవమానం కాదు, తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమంటూ మండిపడ్డారు.*

- **నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది**
- **రైజింగ్ తెలంగాణలో భాగంగా పెట్టుబడులే లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్తుంటే అడ్డుకోవడం సరికాదు**
- **కేంద్రం నన్ను అడ్డుకోగలదు, కానీ నా ఆలోచనల్ని కాదని కేంద్రానికి కౌంటర్: సీఎం రేవంత్**

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 24 :**

కేంద్రం నన్ను అడ్డుకోగలదు, కానీ నా ఆలోచనల్ని కాదని కేంద్రానికి కౌంటర్ ఇచ్చారు. కోట్లాది మంది కేంద్రం వైఖరిని తప్పుపట్టారని, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర నేతలు ఆ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించినట్లు గుర్తుచేశారు. తన అమెరికా పర్యటనపై బీజేపీ నేతలు దుష్ప్రచారం చేశారని విమర్శించారు. విద్య, క్రీడా రంగాలకు సంబంధించి పెట్టుబడులు, సహకారం కోసం అనుమతి కోరుతూ విదేశీ పర్యటనకు ముందుగానే వివరాలు సమర్పించాం. విదేశాంగశాఖ లండన్ పర్యటనకు అనుమతి ఇవ్వగా, అమెరికా పర్యటనను నిరాకరించింది. రైజింగ్ తెలంగాణలో భాగంగా పెట్టుబడులే లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్తుంటే అడ్డుకోవడం సరికాదు. నా పర్యటనకు అనుమతి నిరాకరించడంతో పాటు కేంద్రంలోని బీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేశారు. బీజేపీ నేతల గురించి నేను మాట్లాడదలుచుకోలేదు. బీజేపీ నేతలు విచక్షణ కోల్పోయి ప్రభుత్వ పర్యటనపై అవాస్తవాలు ప్రచారం చేసి, తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఇది రెండు ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులకు సంబంధించిన అంశం ఇది.విద్య, క్రీడలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలకు వెళ్తున్నామని విదేశాంగ శాఖకు దరఖాస్తు చేశామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశాలకు వెళ్తున్నట్లు తెలిపాం. కానీ రాజకీయ పరమైన కారణాలతో అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వలేదని విదేశాంగ శాఖ చెబుతోంది. గతంలోనూ నేను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర నేతలు విదేశాలకు వెళ్తే కేంద్రానికి సమాచారం ఇచ్చి వెళ్లాం. గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ ఆగస్టు 17 నుంచి 24 వరకు యూఎస్, కెనడాలో 8 రోజులపాటు విదేశీ పర్యటనలకు వెళ్లారు.

...మిగతాది 2 లో

# మిస్ యూనివర్స్ ఇండియా 2026గా కాజియా




2 లో

- **కేరళ భామకు దక్కిన ప్రతిష్ఠాత్మక కిరీటం**
- **పుఎర్టో రికో పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం**

**జయభేరి, జైపూర్ :**

దేశీయ సౌందర్య పోటీల రంగంలో ఎంతో ప్రసిద్ధి చెందిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' గ్రాండ్ ఫినాలే రాజస్థాన్‌లోని జైపూర్ నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ ప్రతిష్ఠాత్మక అందాల పోటీల్లో కేరళకు చెందిన 19 సంవత్సరాల కాజియా లిజ్ మెజో విజేతగా నిలిచి 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటాన్ని సొంతం చేసుకుంది. అయితే 'మిస్ యూనివర్స్ ఇండియా 2025' విజేత మణికా విశ్వకర్మ తన వారసురాలైన కాజియాకు అధికారికంగా కిరీటాన్ని అందజేసింది.

**ప్రపంచ వేదికపై భారత్ తరపున పోటీకి సిద్ధం..!**

ఈ విజయం ద్వారా కాజియా లిజ్ మెజో కేవలం జాతీయ స్థాయి కిరీటాన్ని గెలుచుకోవడమే కాకుండా అంతర్జాతీయ వేదికపై దేశ ప్రాతినిధ్యం వహించే గొప్ప అవకాశాన్ని దక్కించుకుంది. నవంబర్ నెలలో పుఎర్టో రికో దేశంలో జరగనున్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 75వ 'మిస్ యూనివర్స్' పోటీల్లో కాజియా భారత్ తరపున పోటీపడి, మన దేశ సౌందర్య వారసత్వాన్ని ప్రపంచం ముందు నిలపనుంది.




2 లో

# కుట్ర చేస్తున్న రేవంత్ సర్కార్

- **కేంద్రం ముందు మోకరిల్లి స్మార్ట్ మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్న రేవంత్ సర్కార్**
- **స్మార్ట్ మీటర్ల ద్వారా ఫ్రీ కరెంట్, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఫ్రీ కరెంట్ ఎత్తివేసే కుట్ర**
- **ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లు పెడితే ఊరుకునేది లేదు**
- **ప్రభుత్వాన్ని హెచ్చరించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**జయభేరి, హైదరాబాద్ :**

కేంద్రం తెచ్చిన కొత్త పథకంపై సంతకం పెట్టి రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అరోపించారు. గతంలో రైతులను ఇబ్బంది పెట్టేలా చేసిన నల్ల చట్టాల్లో భాగంగా తేవాలనుకున్న స్మార్ట్ మీటర్లను మళ్లీ తేవాలని కేంద్రం చేస్తున్న కుట్రలకు రేవంత్ సర్కార్ మోకరిల్లింది. అదానీ వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు, ప్రజలకు నష్టం చేసేందుకు ఈ స్మార్ట్ మీటర్లను తెస్తున్నారని అన్నారు. దీనికి సంబంధించి ప్రజల మైండ్ వాష్ చేసేందుకు ఇటీవలే నెక్లెస్ రోడ్ లో డెమో కార్యక్రమం పెట్టారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ సీఎండీ కూడా స్మార్ట్ మీటర్లు తెస్తున్నామని చెప్పారు. గతంలో మనం ఈఆర్సీలో గొడవ చేస్తే రైతుల బావికాడ మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పారు . కానీ ఇప్పుడు ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.




# ఏపీ లోకల్ పోల్స్‌కు రెడీ

## ఏపీ స్థానిక ఎన్నికల్లో ఎవరి పట్టు ఎంత..?

- **ఏపీలో అక్టోబర్ నెలాఖరు నాటికి స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి**
- **ఈ ఎన్నికల కోసం కూటమి పార్టీల్లో ఇప్పటికే చర్చ**
- **మాజీ సీఎం జగన్ 175 నియోజకవర్గాల ఇంఛార్జ్ లతో కీలక సమావేశం ఏర్పాటు**
- **ఎవరి బలం ఎంత ఈ సమయంలో హోరా హోరీగా మారుతున్న ఈ ఎన్నికల వేళ**

**జయభేరి, విజయవాడ, ఆగస్టు 24 :**

ఏపీలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్దం అవుతోంది. పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. కూటమి వర్సస్ వైసీపీ మధ్య ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 26 నెలలు అవుతున్న వేళ ఈ ఎన్నికలతో ప్రజలు తమతోనే ఉన్నారని నిరూపించోవాలని భారీ ప్రయత్నాలు చేస్తున్నారు. అటు వైసీపీ సైతం ఈ ఎన్నికల కోసం ఇప్పటికే సమాయత్తం కావాలని నిర్ణయించింది. ఇదే సమయంలో క్షేత్ర స్థాయి నివేదికలు మాత్రం ఆసక్తిగా మారుతున్నాయి. ఏపీలో అక్టోబర్ నెలాఖరు నాటికి స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం నుంచి ఈ ఎన్నికలు పూర్తి చేస్తే పెద్ద మొత్తంలో నిధులు రాష్ట్రానికి దక్కనున్నాయి. దీంతో ఈ ఎన్నికల కోసం కూటమి పార్టీల్లో ఇప్పటికే చర్చ మొదలైంది. సీట్ల షేరింగ్ పైన మూడు పార్టీలు కలిసి నిర్ణయం తీసుకోవాలని డిసైడ్ అయ్యాయి. తమకు పట్టు ఉన్న ప్రాంతంలో పోటీ చేస్తామని జనసేన

...మిగతాది 2 లో

# 2029 ప్రధాని రేసులో దళ పతి విజయ్..?

...మిగతాది 2 లో

# రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

- **ఎంపి ఈటల**



**జయభేరి, హైదరాబాద్ :**

భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాను. ఊర్లలో తాతల ఆస్తులు అమ్ముకుని తిరిగేవాన్ని తిరుగుబోతు అనేవారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే పని చేస్తున్నారు. కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ ఏర్పడింది పేదలకు ఇళ్ళ జాగాలు ఇవ్వడానికి, వ్యాపారం చేయడానికి కాదు. రెండో తారీకు ఏర్పాటు చేసిన వేలంపాటను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం అయన కూకట్‌పల్లిలో మీడియాతో మాట్లాడారు. ఈటల మాట్లాడుతూ.. నిజాం కాలంలో 1908లో వరదలు వచ్చినప్పుడు అనేక ఇళ్లు వరదల్లో కొట్టుపోయాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారు. "సిటీ ఇంప్రూవ్మెంట్ బోర్డ్" 1911 లో నిజాం ఏర్పాటు చేసి ప్రజలకు ఇల్లు కట్టించారు. 1931 లో "సికింద్రాబాద్ ఇంప్రూవ్మెంట్ బోర్డ్" ఏర్పాటు చేశారు. ఈ బోర్డ్ 1960 లో హౌసింగ్ బోర్డ్ గా మారింది. ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ భూములు కేటాయించడంతో పాటు రైతుల భూములు కూడా సేకరించారు. కూకట్పల్లి, కైతలాపూర్, హైదర్ నగర్ మూడు గ్రామాల

...మిగతాది 2 లో



# తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ సింగరేణి

- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుని ఘనంగా సన్మానించిన సింగరేణి సంఘాల నాయకులు**

**జయభేరి, హైదరాబాద్ :**

సింగరేణి ఉజ్వల భవిష్యత్తు కోసం కీలక బొగ్గు బ్లాక్‌ల సాధనతో పాటు, సంస్థను కీలక ఖనిజాల మైనింగ్ వైపు విస్తరిస్తున్నందుకు సింగరేణి గుర్తింపు,

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

పరిధిలో 1400 ఎకరాలు సేకరించారు. హౌసింగ్ బోర్డ్ ఉద్యోగులకు గజం 1 రూపాయి 25 పైసలకు ఇచ్చారు. ఆర్థిక స్తోమతను బట్టి కొనుక్కొనే విధంగా 66 గజాలు, 111 గజాలు, 311 గజాలు, 400 గజాలు ప్లాటింగ్ చేశారని అన్నారు. జేఎన్టీయూ NTU కోసం హౌసింగ్ బోర్డ్ 100 ఎకరాలు లీజుకు ఇచ్చారు. హౌసింగ్ బోర్డ్ ఏర్పడింది పేదవారి సొంత ఇంటి కలను నెరవేర్చడానికి తప్ప వ్యాపారం చేయడానికి కాదు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 200506 లో కూకట్పల్లిలో భూముల అమ్మకాలు మొదలుపెట్టారు. మలేషియా టౌన్షిప్ కు 36 ఎకరాలు, హిందూ ప్రాజెక్ట్ కు 70 ఎకరాలు, లోధాకు 18 ఎకరాలు, ఇండీస్ వన్ సిటీకి 12 ఎకరాలు అమ్మారు. స్కూలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాలు, హాస్పిటల్ కట్టుకోవడానికి స్థలాలు కరువయ్యాయి. ఖాళీగా ఉన్న జాగాలను వీటికి కేటాయించండి కానీ అమ్ముకోవద్దు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి కూడా రిప్రజెంటేషన్ ఇచ్చాము. అయినా అమ్ముకుంటున్నారు. హౌసింగ్ బోర్డ్ చట్టం ప్రకారం పేదవారికి ఇళ్ళ జాగాలు ఇవ్వాలి తప్ప ఇలా అమ్ముకోవడానికి హక్కు లేదని అన్నారు. భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాను. బస్తీలలో పని చేసుకునేవారికి ఊరు అవతల డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తే.. అక్కడ పని లేక వారు.. చేపలను నీళ్లలో నుంచి బయట వేస్తే ఎలా కొట్టుకుని చచ్చిపోతాయో.. వారి పరిస్థితి కూడా అలానే ఉంది. ఎక్కడ ఉన్న వారికి అక్కడే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి ఇవ్వాలి. పేదవారికి కట్టించడానికి మనసు రావడం లేదా? పేదవారి కోసమైతే బడ్జెట్ లేదా ? ఇందిర రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అన్నది కేవలం స్లోగన్ గానే మిగిలిపోయిందని అన్నారు.

## ఏపీ స్థానిక ఎన్నికల్లో.. పట్టు ఎంత..?

చెబుతోంది. దీంతో.. 2024 ఎన్నికల తరహాలో కాకుండా జనసేన, బీజేపీ మరింతగా ఈ ఎన్నికల్లో సీట్ల కేటాయింపు శాతం పెరిగే అవకాశం ఉంది. అటు మాజీ సీఎం జగన్ మంగళ వారం 175 నియోజకవర్గాల ఇంఛార్జ్ లతో కీలక సమావేశం ఏర్పాటు చేసారు. స్థానిక ఎన్నికల్లో ప్రతీ చోట పార్టీ అభ్యర్థి ఖచ్చితంగా పోటీలో ఉండాల్సిందేనని నిర్దేశించారు. ఎవరి బలం ఎంత ఈ సమయంలో హోరా హోరీగా మారుతున్న ఈ ఎన్నికల వేళ ప్రముఖ సెఫాలజిస్టులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్నికల షెడ్యూల్.. పొత్తులు ఖరారు కాకపోవటంతో క్షేత్ర స్థాయిలో ఎవరికి ఎక్కడ అనుకూలం ఉందనే సంకేతాలు ఇస్తున్నారు. అందులో భాగంగా ప్రముఖ సెఫాలజిస్ట్ ప్రవీణ్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. అందులో .." కార్పొరేషన్లలో అధికార టీడీపీ గట్టి పట్టు! పంచాయతీల్లో ఊహించని విధంగా పుంజుకున్న వైసీపీ.. మున్సిపాలిటీలు మిక్స్ డ్ రిజల్ట్స్.. రాయలసీమలో కూటమి ప్రత్యేక దృష్టి అవసరం .. Ex : తిరుపతి మేయర్ టీడీపీ బీసీ యాదవ.." అంటూ పోస్టు చేసారు. దీని ద్వారా అర్బన్ లో కూటమి.. రూరల్ లో వైసీపీ పట్టు కనినిపిస్తున్నట్లు విశ్లేషణలు మొదలయ్యాయి. ఈ అంచనాల వేళ.. స్థానిక ఎన్నికలు సెమీ ఫైనల్స్ గా భావిస్తున్న కూటమి.. వైసీపీ మధ్య తుది ఫలితం ఎలా ఉంటుందనే ఆసక్తి కనిపిస్తోంది.

## కుట్ర చేస్తున్న రేవంత్ సర్కార్

తెలంగాణలో ఇప్పుడున్నవన్నీ కూడా స్మార్ట్ మీటర్లే. కానీ కొత్తగా తేనున్న స్మార్ట్ మీటర్ల ద్వారా చాలా నష్టం ఉంటుంది. ఈ మీటర్ల పెడితే మనం ముందే ఫోన్ లో రీఛార్జ్ చేసుకున్నట్లు ప్రీ పెయిడ్ రీఛార్జ్ చేసుకోవాలి. దీని ద్వారా మనకు ఎప్పుడు రీఛార్జ్ అయిపోతే అప్పుడు కరెంట్ పోతుందని అన్నారు. యూపీలో ఇదే విధంగా మీటర్లు పెడితే ఆ మీటర్లను తీసి ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంట్ ఆఫీస్ లలో ప్రజలు వేసి వెళ్తున్నారు. పైగా స్మార్ట్ మీటర్ల కారణంగా ప్రభుత్వం ఇస్తామన్న 2 వందల యూనిట్ల ఫ్రీ కరెంట్ ఎత్తివేసే పరిస్థితి ఉంటుంది. సెలూన్లకు ఇచ్చే ఫ్రీ కరెంట్ కు కూడా ఇబ్బంది అవుతుంది. రేవంత్ రెడ్డి సర్కార్ కేంద్రం ముందు మోకరిల్లి తెలంగాణ ప్రజలకు నష్టం చేసే పనిచేస్తుంది. స్మార్ట్ మీటర్ల కారణంగా ఫ్రీ కరెంట్, సెలూన్లకు ఇచ్చే కరెంట్, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే సబ్సిడీ కరెంట్ ను ఎత్తివేసే ప్రమాదం ఉంది. కనుక ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ రక్షణ సేన ఇందుకు ఒప్పుకోదని హెచ్చరిస్తున్నాం. ముందు ఇప్పుడున్న మీటర్ల ద్వారానే 24 గంటల కరెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. ఆటిజన్లు, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి కరెంట్ సరఫరా బాగా ఉండేలా చూడాలి. ఎప్పుడు ప్రజల జేబులకు చిల్లు పెట్టే కార్యక్రమం కాకుండా వారికి మేలు చేసే పనిచేయాలి. స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## మిస్ యూనివర్స్ ఇండియా కాజియా

**పోటీదారుల మధ్య తీవ్రమైన పోటీ..!**

ఈ పోటీల్లో దేశ నలుమూలల నుంచి మొత్తం 52 మంది ప్రతిభావంతులైన భామలు పాల్గొన్నారు. అనేక నెలల పాటు జరిగిన వివిధ ఆడిషన్లు, ముఖాముఖి ఇంటర్వ్యూలు, ప్రాథమిక రౌండ్లను దాటుకుని వీరంతా ఫినాలేకు అర్హత సాధించారు. తుది విజేతను ఎంపిక చేయడానికి ముందు పోటీదారులందరూ వివిధ కఠినమైన మూల్యాంకన దశలను దాటాల్సి వచ్చింది. తుది ఘట్టంలో మొదటి ఐదు స్థానాల్లో తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్, మహారాష్ట్రకు చెందిన తేజస్విని శ్రీవాస్తవ, కేరళకు చెందిన కాజియా లిజ్ మెజో, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవలేకర్, ఉత్తరాఖండ్‌కు చెందిన అనుభ వశిష్ఠ నిలిచారు. చివరి రౌండ్‌లో ఇచ్చిన 40 సెకన్ల సమారోప ప్రసంగ సవాలులో కాజియా తన అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి జ్యూరీని మెప్పించింది. అర్ధరాత్రి దాటాక తెల్లవారుజామున 2.30 గంటలకు ఆమెను విజేతగా ప్రకటించారు. తుది నిర్ణయంలో తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవలేకర్ తదుపరి స్థానాల్లో నిలిచి 'టాప్ 3' ఎంపికను పూర్తి చేశారు.

**దిగ్గజాల నేతృత్వంలో జ్యూరీ ప్యానెల్..!**

ఈ గ్రాండ్ ఫినాలే పోటీలకు నిపుణులైన జ్యూరీ సభ్యుల బృందం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించింది. భారతదేశం నుంచి తొలిసారిగా 1994లో 'మిస్ యూనివర్స్' కిరీటాన్ని గెలుచుకున్న సుస్మితా సేన్ ఈ జ్యూరీ ప్యానెల్‌కు నేతృత్వం వహించారు. ఈ ప్యానెల్‌లో మాజీ మిస్ యూనివర్స్ ఇండియా విజేతలైన సెలినా జైట్లీ, ఊర్వశి రౌతేలా, రియా సింఘాలతో పాటు ప్రజ్ఞా కపూర్, విశా లాధియా, ఆనా బ్లాంకో, డాక్టర్ స్మృతి ఖరే శుక్లా, 'గ్లామానంద్ గ్రూప్' ప్రెసిడెంట్ కీలక సభ్యులుగా వ్యవహరించారు.

## తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ సింగరేణి

ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి ఆత్మలాంటి సింగరేణి సంస్థను కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయకమైన సంస్థగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులు విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో బొగ్గు, థర్మల్ పవర్‌పై ఆధారపడటం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా BSNL తరహాలో వెనుకబడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందుకే కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్, బంగారం వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు సింగరేణిని తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికే కర్ణాటకలో గోల్డ్ మైన్ వేలంలో సింగరేణి విజయం సాధించిందన్నారు. నైని, తాడిచర్ల2, మణుగూరు డిప్‌సైడ్2 వంటి కీలక బొగ్గు బ్లాక్‌లను సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేసిందని, సంస్థ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మరిన్ని మైనింగ్ అవకాశాలను అందిపుచ్చుకునేలా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణిని NTPC స్థాయిలో దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థగా, అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమర్థవంతమైన నాయకత్వంలో సింగరేణి కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ, నూతన ప్రాజెక్టులతో వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొనియాడారు.

# 2029 ప్రధాని రేసులో దళ పతి విజయ్..?

తమిళ రాజకీయాల్లో మొదలైన ఒక చర్చ ఇప్పుడు జాతీయ రాజకీయాల వైపు దృష్టిని మళ్లిస్తోంది. సినీ హీరో నుంచి రాజకీయ నాయకుడిగా మారిన దళపతి విజయ్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిగా చూడాలన్న చర్చ టీవీకే వర్గాల్లో వినిపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ మాత్రం అంతగా ప్రాధాన్యం ఇవ్వకుండా కొట్టిపారేస్తోంది. కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తాజాగా.. ప్రధాని కావాలంటే లోక్‌సభలో కనీసం 272 మంది ఎంపీల మద్దతు అవసరమని వ్యాఖ్యానించడం ఈ వివాదానికి మరింత రాజకీయ రంగు తెచ్చింది. అయితే విజయ్‌ను 2029 ప్రధాని రేసులోకి ఇప్పుడే తీసుకురావడం రాజకీయ వాస్తవాల కంటే రాజకీయ ఆకాంక్షలకు దగ్గరగా కనిపిస్తోంది. అదే సమయంలో ఆ ఆకాంక్షను పూర్తిగా కొట్టిపారేయడం కూడా అంత సులభం కాదు. ఎందుకంటే తమిళనాడులో విజయ్ నాయకత్వంలోని టీవీకే ఇప్పటికే కాంగ్రెస్‌తో బలమైన రాజకీయ బంధాన్ని ఏర్పరుచుకుంది. 2026 ఎన్నికల తర్వాత కాంగ్రెస్-టీవీకే సంబంధం కేవలం ఎన్నికల పొత్తుకే పరిమితం కాకుండా దీర్ఘకాలిక రాజకీయ భాగస్వామ్యంగా మారే సంకేతాలు కనిపించాయి. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. విజయ్‌కు జాతీయ రాజకీయాల్లో నిజంగా అంత స్థాయి ఉందా? లేక తమిళనాడులోని అభిమాన బలం, యువతలో ఉన్న క్రేజ్‌ను జాతీయ రాజకీయాలకు అన్వయించడం మాత్రమేనా?

సినీ స్టార్‌గా విజయ్‌కు ఉన్న ప్రజాదరణను తక్కువ అంచనా వేయలేం. కానీ ఎన్నికల్లో ప్రజాదరణను ఓట్లుగా, ఓట్లను సీట్లుగా, సీట్లను జాతీయ స్థాయి రాజకీయ శక్తిగా మార్చడం పూర్తిగా వేరు. ప్రధాని పదవి కోసం కేవలం వ్యక్తిగత ఇమేజ్ సరిపోదు. దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణం, రాష్ట్రాల వారీగా బలమైన నాయకత్వం, పార్లమెంటరీ సంఖ్యాబలం, విస్తృతమైన కూటమి, స్పష్టమైన జాతీయ విధానాలు అవసరం. ఇప్పటి వరకు విజయ్ రాజకీయ ప్రయాణం ప్రధానంగా తమిళనాడుకే పరిమితమైంది. అందువల్ల 2029 నాటికి ఆయన జాతీయ స్థాయిలో ఎంత మేరకు విస్తరించగలర



న్నదే అసలు పరీక్ష. మరోవైపు కాంగ్రెస్‌కు కూడా ఈ పరిణామం అంత తేలికైనది కాదు. ఒకప్పుడు డీఎంకేతో దీర్ఘకాలికంగా కలిసి పనిచేసిన కాంగ్రెస్, ఇప్పుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేతో చేతులు కలపడం తమిళ రాజకీయ సమీకరణాల్లో కీలక మార్పు. 2026 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం, భవిష్యత్ లోక్‌సభ ఎన్నికలతో పాటు ఇతర ఎన్నికల్లోనూ కలిసి పనిచేయాలనే సంకేతాలు ఇవ్వడం ఈ బంధం తాత్కాలికం కాదనే సూచనలుగా కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడే టీవీకే-కాంగ్రెస్ మధ్య భవిష్యత్ విభేదాలకు బీజం పడే అవకాశం కూడా ఉంది. విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా టీవీకే ముందుకు తెస్తే కాంగ్రెస్ అంగీకరిస్తుందా? కాంగ్రెస్ జాతీయ నాయకత్వం రాహుల్ గాంధీని ప్రధానమంత్రి ముఖంగా కొనసాగించాలని భావిస్తే విజయ్ ఆశయాలకు స్థానం ఎక్కడ ఉంటుంది? ఈ ప్రశ్నలకు ఇప్పుడే సమాధానం లేదు.

కాంగ్రెస్‌కు విజయ్ అవసరం ఉండొచ్చు. విజయ్‌కు కాంగ్రెస్ సంస్థాగత బలం అవసరం కావచ్చు. కానీ ఎవరు ఎవరిని రాజకీయంగా ఉపయోగించుకుంటారు? అన్నది 2029 వరకు కొనసాగబోయే అసలు పోరు. టీవీకేకు విజయ్ ఒక జనాకర్షణ కలిగిన ముఖం. కాంగ్రెస్‌కు దేశవ్యాప్త సంస్థాగత అనుభవం ఉంది. ఈ రెండూ కలిస్తే తమిళనాడులోనే కాకుండా జాతీయ రాజకీయాల్లో కూడా కొత్త సమీకరణానికి అవకాశం ఉంటుంది. కానీ నాయకత్వ ప్రశ్న వచ్చినప్పుడు ఈ భాగస్వామ్యం ఎంతకాలం నిలుస్తుందన్నది కీలకం. ప్రస్తుతం విజయ్‌ను 2029 ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం తొందరపాటు రాజకీయ అంచనానే కావచ్చు. అయితే ఆ చర్చను పూర్తిగా ఫ్యాన్ క్లబ్ కలగా కొట్టిపారేయడం కూడా సరైన రాజకీయ విశ్లేషణ కాదు. ఎందుకంటే భారత రాజకీయాల్లో అనేక మార్పులు ఊహించని చోట్ల నుంచే వచ్చాయి. ఒకప్పుడు ప్రాంతీయ నేతల జాతీయ ఎదుగుదల కూడా అసాధ్యంగా కనిపించింది. కాబట్టి విజయ్‌కు ముందున్న మార్గం స్పష్టంగా ఉంది.. ముందుగా తమిళనాడులో తన రాజకీయ స్థిరత్వాన్ని నిరూపించాలి. తర్వాత దక్షిణ భారతదేశంలో ప్రభావాన్ని పెంచాలి. ఆపై జాతీయ సమస్యలపై తన వైఖరిని ప్రజలకు వివరించాలి.

### సంపాదకీయం



మోతె రఘు తిరుపతి రెడ్డి
'జయభేరి' దినపత్రిక ఎడిటర్

2029లో విజయ్ ప్రధాని అవుతారా? అన్న ప్రశ్నకు ఇప్పుడే సమాధానం చెప్పడం కష్టం. కానీ 2029 రాజకీయ సమీకరణాల్లో విజయ్ ఒక ముఖ్యమైన కారకుడిగా మారతారా? అన్న ప్రశ్నకు మాత్రం ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. అందుకే ఇది కేవలం విజయ్ వర్సెస్ కాంగ్రెస్ పోరు కాదు. ఇది స్టార్ ఇమేజ్ వర్సెస్ సంస్థాగత రాజకీయాలు, ప్రాంతీయ శక్తి వర్సెస్ జాతీయ నాయకత్వం, కొత్త తరం రాజకీయాలు వర్సెస్ పాత రాజకీయ వ్యవస్థ మధ్య జరుగుతున్న భవిష్యత్ పోరుకు సంకేతం. 2029కు ఇంకా సమయం ఉంది. కానీ రాజకీయ గడియారం మాత్రం ఇప్పటి నుంచే టిక్‌టిక్ మంటోంది.

## పిల్లల భద్రతపై వార్తలు మనకు ఇచ్చే హెచ్చరిక
# ఇక ముందేం చేయాలి?

**జయభేరి, హైదరాబాద్ :**

ఇటీవల పిల్లలకు సంబంధించిన అనేక విషాదకరమైన వార్తలు మన ముందుకు వస్తున్నాయి. కొందరు పిల్లలు చట్ట విరుద్ధ కార్యకలాపాల్లో చిక్కుకోవడం, మరికొందరు హింసాత్మక ఘటనల్లో నిందితులుగా మారడం, ఇంకొన్ని సందర్భాల్లో పాఠశాల ప్రాంగణంలోనే పిల్లలు ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు ప్రతి తల్లిదండ్రిని, ప్రతి ఉపాధ్యాయుడిని, ప్రతి బాధ్యతగల పౌరుడిని ఆలోచింపజేయాలి. ఒక్కో ఘటనకు కారణాలు వేర్వేరుగా ఉండవచ్చు. కానీ వీటన్నింటి వెనుక మనం ఒకే ప్రశ్నను అడగాలి.. పిల్లలను ముందుగానే రక్షించడంలో మనం ఎక్కడ విఫలమవుతున్నాం? చట్టంతో ఘర్షణకు వచ్చిన ప్రతి బాలుడిని కేవలం "నేరస్థుడు"గా చూడటం పరిష్కారం కాదు. అదే సమయంలో పిల్లల ప్రవర్తనలో కనిపించే ప్రమాదకరమైన మార్పులను నిర్లక్ష్యం చేయడం కూడా సరైంది కాదు. కోపం, ఒంటరితనం, తీవ్రమైన ప్రవర్తనా మార్పులు, హింసాత్మక ఆలోచనలు, చెడు స్నేహాలు, మత్తు పదార్థాల ప్రభావం, ఆన్‌లైన్‌లో హింసాత్మక లేదా ప్రమాదకరమైన కంటెంట్‌కు గురికావడం, డబ్బు మరియు విలాసవంతమైన జీవితం పట్ల అసహజమైన ఆకర్షణ.. ఇలాంటి సంకేతాలను కుటుంబం, పాఠశాల, సమాజం ముందుగానే గుర్తించాలి.

పిల్లల రక్షణ అంటే కేవలం ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు. ప్రమాదం జరగకముందే నివారించడం నిజమైన బాలల రక్షణ. ప్రతి పాఠశాలలో పిల్లలతో నిరంతరం మాట్లాడే వ్యవస్థ ఉండాలి. వారికి కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, కోప నియంత్రణ, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం, మంచి-చెడు మధ్య తేడాను గుర్తించడం, సహాయం కోరడం వంటి అంశాలపై మార్గదర్శకత్వం అందాలి.

ఉపాధ్యాయులు కేవలం విద్యాబోధకులుగానే కాకుండా, పిల్లల ప్రవర్తనలో మార్పులను గుర్తించే బాధ్యతగల పెద్దలుగా కూడా ఉండాలి. పాఠశాలలో పిల్లల భద్రత విషయంలో మాత్రం ఎలాంటి రాజీ ఉండకూడదు. భద్రతా ప్రమాణాలు, పాఠశాల ప్రాంగణంలో పర్యవేక్షణ,



**చందాన మారిపల్లి**
మెంబెర్
తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్

అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం, సిబ్బంది బాధ్యతలు, ఫిర్యాదుల వ్యవస్థ, పిల్లలకు సురక్షితమైన వాతావరణం వంటి అంశాలను నిరంతరం సమీక్షించాలి. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత మాత్రమే కారణాలను వెతకడం కాకుండా, ముందుగానే సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోపాలను సరిదిద్దాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడే సమయాన్ని కేటాయించాలి. "చదువు ఎలా ఉంది?" అని మాత్రమే కాకుండా, "ఎవరితో స్నేహం చేస్తున్నావు?", "ఏమైనా సమస్య ఉందా?", "ఎవరైనా నిన్ను భయపెడుతున్నారా?", "ఆన్‌లైన్‌లో ఏం చూస్తున్నావు?" అని ప్రేమగా అడగాలి. పిల్లలు తప్పు చేసినప్పుడు వెంటనే శిక్షించడమే కాకుండా, ఎందుకు అలా జరిగిందో అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. అదే సమయంలో హింస, నేరం లేదా ఇతర ప్రమాదకర ప్రవర్తనను సమర్థించకుండా, అవసరమైనప్పుడు నిపుణుల సహాయం తీసుకోవాలి.

సోషల్ మీడియా ప్రభావాన్ని కూడా మనం తీవ్రంగా పరిగణించాలి. పిల్లలు చూసే ప్రతి కంటెంట్ వారి ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేయవచ్చు. అందుకే డిజిటల్ లిటరసీతో పాటు డిజిటల్ బాధ్యతను కూడా నేర్పించాలి. ఆన్‌లైన్‌లో వేధింపులు, బెదిరింపులు, మోసాలు, అనుచిత కంటెంట్ లేదా ప్రమాదకరమైన వ్యక్తుల పరిచయం ఎదురైతే ఎలా స్పందించాలి, ఎవరికి చెప్పాలి, ఎలా రిపోర్ట్ చేయాలి అనే విషయాలను పిల్లలకు స్పష్టంగా తెలియజేయాలి. ముఖ్యంగా, పిల్లల హక్కుల పరిరక్షణలో రిపోర్టింగ్ సంస్కృతి పెరగాలి. సమస్యను దాచిపెట్టడం పిల్లలను మరింత ప్రమాదంలోకి నెడుతుంది. పిల్లలకు ఏదైనా అన్యాయం జరిగినప్పుడు "ఎవరూ తెలుసుకోకూడదు" అనే భయాన్ని తొలగించి, విశ్వసనీయమైన పెద్దలకు చెప్పే ధైర్యాన్ని కల్పించాలి.

ఫిర్యాదు చేసిన పిల్లలను నిందించకుండా, వారి గోప్యతను కాపాడుతూ, చట్టపరమైన రక్షణ మరియు అవసరమైన సహాయాన్ని అందించాలి. పిల్లల రక్షణ బాధ్యత ఒక్క పోలీసు శాఖదీ కాదు, ఒక్క పాఠశాలదీ కాదు, ఒక్క తల్లిదండ్రులదీ కాదు. కుటుంబం-పాఠశాల-పోలీసు-బాలల రక్షణ వ్యవస్థ-వైద్య, మానసిక ఆరోగ్య నిపుణులు-స్థానిక సమాజం-ప్రభుత్వ సంస్థలు కలిసి పనిచేసినప్పుడే సమగ్ర రక్షణ సాధ్యమవుతుంది. ప్రతి విషాదకరమైన వార్తను మరొక వార్తగా మర్చిపోకుండా, దాని నుంచి ఒక పాఠం నేర్చుకోవాలి.

ఒక పిల్లవాడి ప్రవర్తనలో కనిపించిన చిన్న హెచ్చరికను సకాలంలో గుర్తించడం ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు. ఒక పాఠశాలలో కనిపించిన భద్రతా లోపాన్ని వెంటనే సరిచేయడం మరో ప్రమాదాన్ని నివారించవచ్చు. ఒక పిల్లవాడు చెప్పిన మాటను శ్రద్ధగా వినడం అతని జీవితాన్ని మార్చవచ్చు. పిల్లల రక్షణ అంటే కేవలం చట్టాన్ని అమలు చేయడం కాదు; పిల్లలను అర్థం చేసుకోవడం, వినడం, మార్గనిర్దేశం చేయడం, రక్షించడం. మన పిల్లల గురించి వార్తలు వచ్చిన తర్వాత స్పందించే సమాజంగా కాకుండా, ప్రమాదం రాకముందే గుర్తించి నివారించే సమాజంగా మారాలి. మన పిల్లల భద్రతకు మన అప్రమత్తతే మొదటి రక్షణ. ఈరోజు మనం తీసుకునే జాగ్రత్తే రేపటి ఒక చిన్నారి జీవితాన్ని కాపాడవచ్చు.




మొదటిపేజీ తరువాయి

వైబ్రెంట్ గుజరాత్ లో భాగంగా పెట్టుబడుల ఆకర్షణకు గుజరాత్ సీఎంకు పర్మిషన్ ఇచ్చారు. కానీ తెలంగాణ రైజింగ్ లో భాగంగా సీఎం అయిన నేను పర్యటనకు వెళ్తానంటే అనుమతి ఇవ్వలేదు. యూకే, అమెరికా పర్యటనలకు వివరాలు ముందుగానే సమర్పిస్తే లండన్‌కు అనుమతిచ్చి, అమెరికా పర్యటనకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. ఇంగ్లాండ్‌లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి వెళ్లి చర్చలు జరిపితే హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు పరిశీలనకు టీంను పంపిస్తామని చెప్పారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీకి వెళ్తే క్యాంపస్ లో షార్ట్ టర్మ్ కార్యక్రమాలు చేపడతామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఆక్స్‌ఫర్డ్ క్యాంపస్ పరిశీలిస్తాం అన్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వారు టీంను హైదరాబాద్‌కు పంపించి అవకాశాలపై పరిశీలిస్తామని చెప్పారు. అమెరికాలో హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్ హైదరాబాద్‌లో ఏర్పాటుకుగానీ, లేదా షార్ట్ టర్మ్ కోర్సుల కోసం సహకారం అందించడంపై చర్చించనున్నట్లు తెలిపారు. టాప్ 10లో యూనివర్సిటీలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమన్నారు. బీఆర్ అంబేద్కర్ ఇంగ్లాండ్‌లో చదువుకోవడం ద్వారా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో చదువుకోవడం ద్వారా దేశానికి దార్శనికుడిగా మారారు. ప్రపంచ స్థాయి యూనివర్సిటీల్లో చదువుకోవడం ద్వారా ఆ నాలెడ్జ్ రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు నడిపించడంలో దోహదం చేస్తుందన్నారు. విదేశాల్లో చదువుకోవాలంటే కోట్లు ఖర్చు పెట్టడం కొందరికి మాత్రమే సాధ్యమని, ఆ యూనివర్సిటీలను తెలంగాణకు తీసుకురావాలని భావించినట్లు తెలిపారు. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటనకు అనుమతించారని, కానీ అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. తన పర్యటనలో ఎలాంటి దాపరికం లేదని స్పష్టం చేశారు. ఏదైనా దాపరికం ఉందని విదేశాంగ శాఖ భావిస్తే అందుకు కారణాలను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉన్నప్పుడే ఈ అంశంపై స్పందిస్తే తనను దేశద్రోహి అంటారని రేవంత్ అన్నారు. అందుకే భారత్‌కు తిరిగొచ్చిన తర్వాత స్పందిస్తున్నానని చెప్పారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడమే తన పర్యటన ఉద్దేశమని తెలిపారు. అమెరికా పర్యటనకు తాను వెళ్లలేకపోయినా రాష్ట్ర అధికారులు అక్కడికి వెళ్లారని రేవంత్ చెప్పారు. పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాల విషయంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకోబోతున్నామని తెలిపారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తున్నారని రేవంత్ అన్నారు. తెలంగాణ సీఎంకు మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇది వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. గుజరాత్ గుత్తాధిపత్యానికి ఇదే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడాన్ని అడ్డుకోవడమే కేంద్రం నిర్ణయం ఉద్దేశమని రేవంత్ విమర్శించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు మద్దతు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీ ఎంపీలకు అవసరం లేదా అని నిలదీశారు.

# వైద్య శాఖ అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష

- అవసరమైన చోట అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి అవసరమైన ప్రాంతాలలో అన్ని చర్యలు చేపట్టాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలో చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ లో సోమవారం డీఎంహెచ్ఓ మరియు వైద్యశాఖ అధికారులతో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమావేశమై నియోజకవర్గంలోని వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అవసరమైన ప్రాంతాల్లో ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పీహెచ్ సీలు), హెల్త్ సబ్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సిహెచ్ సిలు) ఏర్పాటు చేయడం పై చర్చించారు.నియోజకవర్గంలో ఎక్కడెక్కడ పీహెచ్ సి లు, సబ్ సెంటర్లు అవసరమో గుర్తించి, పీహెచ్ సి లు, సబ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి ప్రపోజల్స్ సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా మౌలిక వసతులను బలోపేతం చేయడం, ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు, డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన మందులు (డ్రగ్స్) ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో వైద్యశాఖతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం దమగ్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్ (పీహెచ్ సి ) నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ డీఎంహెచ్ఓ మరియు వైద్యశాఖ అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు.



## ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించాలి

జయభేరి, యాదగిరిగుట్ట, ఆగష్టు 24 :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కరించేలా చూడాలని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఎన్. శోభారాణి అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం పరిశీలించిన, తదుపరి మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి,ప్రజా వాణి పిటిషన్ పై సూచనలు ఇచ్చారు. అలాగే విబిజి రాంజీ పథకంలో భాగంగా జలసిరి, ఫామ్ పాండ్స్, సోక్ ఫిట్స్, మ్యాజిక్ సోక్ ఫిట్స్, బోర్వెల్ రీఛార్జ్ తదితర పనులు ప్రతి గ్రామానికి ఇద్దరు ఇంచార్జి అధికారులను నియమించుకొని పూర్తి చేయవలసిందిగా అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లం నాగన్న పోరాట స్ఫూర్తి అమోఘం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- అప్పంపల్లి లో బెల్లం నాగన్న విగ్రహ ప్రతిష్టాపన




జయభేరి, దేవరకద్ర :

వీరుల పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కౌకుంట్ల మండలం అప్పంపల్లి లో సోమవారం తెలంగాణ విమోచన ఉద్యమకారుడు బెల్లం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వీరుల త్యాగాలను స్మరించు కుందామన్నారు. ఈ సందర్భంగా బెల్లం నాగన్న చేసిన సేవలను ఎమ్మెల్యే జిఎంఆర్ గుర్తు చేశారు. వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తిని కూడా కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండా సురేఖకు షాకిచ్చిన సీఎం రేవంత్

- మంత్రికి తెలియకుండానే అటవీ శాఖలో డిప్యూటేషన్లు రద్దు

జయభేరి, హైదరాబాద్ :



తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే మంత్రి కొండా సురేఖ వివాదం.. అటు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నవేళ.. మరో ఘటన జరిగింది. రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు సంబంధించిన శాఖలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అటవీ శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న పలువురు అధికారులు, ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ నిర్ణయం జరిగిందన్న ప్రచారం ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో చర్చకు దారితీసింది. డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారులు వెంటనే పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయం వెనుక పరిపాలనా కారణాలే ఉన్నాయా లేక ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలతో దీనికి ఏమైనా సంబంధం ఉందా అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది. అటవీ శాఖలో వివిధ బాధ్యతల్లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న పలువురు ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆయా శాఖకు సంబంధించిన కీలక పరిపాలనా నిర్ణయాలు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లడం ఆనవాయితీగా ఉంటుంది. అయితే.. తాజాగా అధికారుల డిప్యూటేషన్ రద్దు వ్యవహారంలో మంత్రి కొండా సురేఖకు ముందుగా సమాచారం ఇవ్వలేదన్న ప్రచారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే అటవీ శాఖలో అధికారుల డిప్యూటేషన్లను ఎందుకు రద్దు చేశారు.. ఏయే అధికారులను వెనక్కి పంపిస్తున్నారు.. అటవీ శాఖలో తదుపరి ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి అనే అంశాలపై అధికార వర్గాల్లో ముమ్మరంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ నిర్ణయాన్ని పరిపాలనా చర్యల్లో భాగంగానే తీసుకున్నదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు.. తన విదేశీ పర్యటన తర్వాత తాజాగా మీడియా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితకు సంబంధించిన వివాదంపైస్పందించారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత అంశాలపై తాను బహిరంగంగా మాట్లాడబోనని పేర్కొన్నారు. అధిష్ఠానం లేదా క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒకవైపు కొండా సురేఖ వ్యవహారంపై పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన కొనసాగుతుండగా..మరోవైపు ఆమె నిర్వహిస్తున్న అటవీ శాఖలో డిప్యూటేషన్లు రద్దు కావడం రాజకీయంగా తీవ్ర ఆసక్తిని పెంచింది. ఈ రెండు పరిణామాలు ఒకే సమయంలో చోటుచేసుకోవడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. అయితే డిప్యూటేషన్ల రద్దు నిర్ణయాన్ని కొండా సురేఖ వ్యవహారంతో ముడిపెట్టడానికి అధికారికంగా ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదు. పరిపాలనా అవసరాల నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



## గుండెపోటుతో క్రైమ్ ఎస్సై కృష్ణ ప్రసాద్ మృతి

జయభేరి, యాదగిరిగుట్ట, ఆగష్టు 24 :

యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో క్రైమ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై కృష్ణ ప్రసాద్ గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ లో తన కుమారుని వద్ద ఉన్న ఎస్సై అకస్మాత్తుగా గుండెపోటుతో గురై మృతి చెందినట్లు తెలిపారు.

## ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా హ్యాట్రిక్

- మూడోసారి గోల్డ్ మోడల్ ను సాధించిన హరివర్ధన్ గౌడ్



జయభేరి, దేవరకొండ :

వైజాగ్ లో జరిగిన కరాటే పోటీలలో ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా హ్యాట్రిక్ గా మూడోసారి గోల్డ్ మోడల్ ను దేవరకొండ 18 వార్డు కౌన్సిలర్ వి.అంజిగౌడ్ తనయుడు హరివర్ధన్ గౌడ్ అందుకున్నారు.వరుసగా గోల్డ్ మోడల్స్ సాధించడం పట్ల దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ అభినందించారు. రానున్న రోజులలో మరిన్ని మెడల్స్ సంపాదించి దేవరకొండ నియోజకవర్గంకు మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.



## కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కోసం గాలింపు

జయభేరి, హైదరాబాద్ :

హత్యాయత్నం కేసులో మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్ తో పాటు అతడి అనుచరుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. గత నెల 30న జూబ్లీహిల్స్లో డబ్బు విషయమై మాట్లాడేందుకు పిలిపించి, రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణపై ఇనుపరాడ్తో దాడి చేసినట్లు కేసు నమోదైంది. పరారీలో ఉన్న సుమంత్ కోసం నాలుగు బృందాలు గాలిస్తుండగా, ఆయన డ్రైవర్ నవీన్ ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు.

# పవిత్రోత్సవాలు పరిసమాప్తం

- వైభవంగా మహా పూర్ణాహుతి

జయభేరి, యాదగిరిగుట్ట :



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పవిత్రోత్సవాలు మహా పూర్ణాహుతితో పరిసమాప్తి జరిగాయి. లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో ఆలయ పవిత్ర ఉత్సవాలు మూడు రోజులుగా శ్రీ పంచరాత్ర శాస్త్రానుసారం వైభవంగా జరిగాయి. సోమవారం ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు అర్చక బృందం శాస్త్రక్తంగా పూజలు నిర్వహించి మహా పూర్ణాహుతిని గావించారు. శ్రీవారి ఆలయంలో జరుగు నిత్య పూజలో తెలిసి తెలియక చేసినటువంటి అపచారాలు తొలగిపోవుటనే ఈ పవిత్ర ఉత్సవాలు అని ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొని దర్శించుకున్న వారికి స్వామివారి కృపతో తమ పాపాలు పోయి పవిత్రంగా మారుతారని తెలిపారు. అనంతరం స్వామివారి పవిత్రోత్సవ మాలను భక్తులకు అందజేసినట్లుగా తెలిపారు. ఈ పూజ వేడుకలలో ఆలయ ధర్మకర్త సభ్యుడు,ఆలయ ఈవో భవాని శంకర్, ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు సురేంద్రాచార్యులు, నరసింహమూర్తి, మాధవాచార్యులు, అర్చకుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల పోరాటానికి దిగివచ్చిన ప్రభుత్వం

- ఆటో యూనియన్ జిల్లా జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. రాము



జయభేరి, దేవరకద్ర :

ఆటోల సమ్మె విషయంలో పోరాటాన్ని ఆపలేదని కేవలం ప్రస్తుతం వాయిదా వేయడం జరిగిందని ఆటో యూనియన్ జిల్లా జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాము అన్నారు. దేవరకద్రలో సోమవారం ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సమావేశంలో రాము మాట్లాడారు. ఆటో డ్రైవర్ల మొదటి విడత పోరాటంలో ప్రభుత్వం దిగివచ్చి చర్చలు జరిపిందన్నారు. ప్రత్యేకమైన డిమాండ్ సంక్షేమ బోర్డు అని అన్నారు. కార్మిక శాఖ, రవాణా శాఖ కూర్చొని డ్రాపింగ్ తయారుచేసి ముందుకు వెళ్లాలి కాబట్టి దీనికి సమయం పడుతుందన్నారు. దేనికిగాను వచ్చే నెల మొదటి వారంలో ఈ పని ప్రారంభిస్తా మన్నారు. ఈ డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం సమయం అడిగింది కాబట్టి మనం వారికి సమయం ఇవ్వడం జరిగిందన్నారు. అంతేకానీ పోరాటాన్ని మాత్రం ఎట్టి పరిస్థితిలో ఆపలేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం మోసం చేయాలని చూస్తే పరిస్థితి మళ్ళీ మొదటికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీర ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట్ల రామకృష్ణ, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసిన ఏరుకొండ రాము

- యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలి
- రక్తదానంతో ప్రాణాలు నిలబెట్టవచ్చు

జయభేరి, కొండమల్లేపల్లి :



నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి రాజు గుండె సంబంధిత వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతున్నాడు. అతడికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం అయింది. అతడిది ఏబి నెగటివ్ బ్లడ్ కావడంతో దొరకక కొంత ఆపరేషన్ రెండు నెలలు వాయిదా వేశారు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఏరుకొండ రాము హైదరాబాదులోని హైటెక్ సిటీలో గల మెడికవర్ హాస్పిటల్ సోమవారం రాజుకు రక్తదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు ఆపరేషన్ అనంతరం రాజు త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థించారు. ముఖ్యంగా యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చు అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, పెద్దపెద్ద ఆపరేషన్లు అవసరమైనప్పుడు రక్తం దొరకక చాలామంది ఆసువులు బాసిన సందర్భాలు ఉన్నాయని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేస్తే ఎన్నో ప్రాణాలు నిలబెట్టవచ్చు అన్నారు. ఈ సందర్భంగా రాజు కుటుంబ సభ్యులు రాముకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నరసింహ స్వామికి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పూజలు



జయభేరి, దేవరకద్ర :

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలం పెద్ద చింతకుంటలో సోమవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ దర్శించుకున్నారు. తన సొంత పొలంలో కొలుదీరిన స్వామి వారిని కుటుంబ సమేతంగా మాజీ ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలను సాంప్రదాయరీతిలో నిర్వహించారు.



## దంతాలపల్లి వైన్ షాపుల తనిఖీ

**జయభేరి, దంతాలపల్లి, ఆగస్టు24 :**

మండలంలో ఉన్న వైన్ షాపులను తనిఖీ చేసిన ఎక్సైజ్ ఎస్సై, అధికారులు షాప్ లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవళి రెడ్డి మాట్లాడుతూ.. మద్యం ప్రియుల్లో మైనర్లకు మద్యం ఇస్తున్నారని అంశంపై తనిఖీ చేసి సిసి ఫుటేజ్ లను సేకరించి రికార్డులను పరిశీలించారు. ఈ అంశంపై ఎస్సై మాట్లాడుతూ.. అలాంటిది జరిగినట్లయితే తగు చర్యలు తీసుకుంటామని మైనర్లకు ఇచ్చిన చో తగు చెర్యలు అన్నారు అధిక రెట్లకు కూడా అమ్మడం లేదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మధుసూధన్ రమేష్, శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం



**జయభేరి, పరవాడ:**

పరవాడ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు మండలంలో 79 మంది అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న రెండవ రోజు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంనకు సిడిపివో వి.లలిత కుమారి గారు,మండల విద్యాశాఖ అధికారి 1 ఎస్. జగన్నాధం సందర్శించి అంగన్వాడి కార్యకర్తలు మూడు రోజుల శిక్షణ పూర్తి చేసుకుని శిక్షణలో నేర్చుకున్నవన్నీ కేంద్రం పరిధిలో ఉన్న తల్లి పిల్లలకు అమలు చేయాలని సూచనలు చేశారు చేయాలని, కేంద్రం పరిధిలో ఉన్న గర్భవతులు బాలింతలు అందరికీ పోషణ మరియు ఆరోగ్యం గురించి తీసుకోవాలని మాట్లాడారు, ఆరోగ్యము మరియు విద్య, బాలల రక్షణ మరియు బాధ్యతాయుతమైన సంరక్షణ, జెండర్ ఇన్ ఎర్లీ ఇయర్స్, అంగన్వాడీల్లో డిజిటల్ కంటెంట్ సంబంధించిన అంశాలపై రిసోర్స్ పర్సన్స్ ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు ఏ శ్యామల కుమారి,పి లక్ష్మి, హెచ్.వి.రమణి సెకండ్ సెకండ్ గ్రేడ్ టీచర్లు పి ఎన్ మూర్తి,జి శ్రీనివాసరావు, జి సతీష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం నాగలక్ష్మి మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

## సాయి విద్యా నికేతన్లో అభయ అవగాహన కార్యక్రమం



**జయభేరి, పరవాడ:**

పరవాడలో శ్రీ సాయి విద్యా నికేతన్లో ఎస్ ఐ జి స్ వి మహాలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 100 మంది బాలికలకు అభయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బాలికల భద్రతకు సంబంధించిన బాల్య వివాహాలు, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, సైబర్ మోసాలు, ఆన్లైన్ భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో 100, 112, మహిళల సహాయం కోసం 181, పిల్లల సహాయం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, సైబర్ మోసాలకు సంబంధించి 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని వివరించారు. బాలికలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసేందుకు అభయ డ్రాప్ బాక్స్ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో శ్రీ సాయి విద్యా నికేతన్ కరస్పాండెంట్ రంగారావు, ప్రిన్సిపాల్ వాసవి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హక్కుల సాధన కోసం ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 24:**

ఆగస్టు 31న చలో ఇందిరాపార్క్ మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం లు మాట్లాడుతూ భువనగిరి జిల్లా నూతనంగా ఏర్పడి శతాబ్దం అవుతున్నప్పటికీ జిల్లాలో ఇంతవరకు ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పురోగతి సాధించలేదన్నారు జిల్లాకు వ్యవసాయతర ప్రధాన జీవనాధారంగా ఉంది లక్షలాదిమంది చిన్న సన్న కారు మధ్యతరగతి రైతాంగం ఆధారపడి తమ కుటుంబాలను గడుపుతున్నారని అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకై డిమాండ్ చేస్తూ ఆగస్టు 29, 30, 31 తేదీల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని 29న భువనగిరి అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న ఇందిరా పార్కు చేరుకొని మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, కొక్కొండ లింగయ్య, గడ్డమీది నరసింహ, తలారి మాతయ్య, తూటి వెంకటేశం, గుండెబోయిన వెంకటేశం పాల్గొన్నారు.

# 24 నుంచి 36 గంటల్లో సమస్యల పరిష్కారం

- 22ఏ నిషేధిత భూములపై మంత్రి పొంగులేటి

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 24 :**




సంచలనంగా మారిన 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై గత కొన్ని రోజులుగా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములు, నిషేధిత భూములు కాకున్నా ఈ జాబితాలో ఉండి, స్లాట్ బుక్ చేసుకున్న భూముల సమస్యను 24 గంటల నుంచి 36 గంటల్లో పరిష్కరిస్తామన్నారు. ఆర్డర్స్ అన్నీ సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని, 22ఏ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. స్లాట్ బుక్ చేసుకున్న వారిలో 98 శాతం మంది రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తున్నామని తెలిపారు. నిషేధిత భూముల జాబితాలో మావి ఉన్నాయి అంటూ ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా సమస్య సృష్టించాలని చూస్తున్నాయని మండిపడ్డారు. కొన్ని నిజాలున్నప్పటికీ, అబద్ధాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి సోమవారం జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షలో నిజాలను అడిగి తెలుసుకుంటున్నాం. జెన్యూన్‌గా 22ఏలో మా భూములు ఉన్నాయి. ప్రభుత్వ వేలంలో కొనుక్కున్నాం. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ కొందరికి సమస్య ఉంది. కొన్ని భూముల జాబితా క్లియర్ కాగా, మరికొన్ని భూముల ఆర్డర్స్ ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేస్తాం. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన అధికారులు, స్టాంప్స్ రిజిస్ట్రేషన్లు, సంబంధిత శాఖల అధికారులతో రివ్యూ చేసుకుని CURE ప్రాంతంలో రైతులు, భూములున్న ఇతర ఆసాములకు సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం. భూముల సమస్యల పరిష్కారానికి త్వరలోనే జీవో కాపీలు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేస్తాం. స్లాట్స్ బుక్ చేసుకున్న వారిలో 98 శాతం మందివి రిజిస్ట్రేషన్స్ పూర్తవుతాయి. గతంలో 22ఏ కింద గతంలో రిలాక్సేషన్ ఇచ్చిన భూములు మళ్లీ ఆ జాబితాలో వచ్చినా పరిష్కరిస్తాం. కొన్నిచోట్ల దేవాదాయ శాఖ భూములు, భూదాన్ భూములకు స్లాట్స్ బుక్ చేసుకున్నారు. అలాంటి భూములకు రిజిస్ట్రేషన్ చేయడం లేదు. గతంలో స్లాట్స్ బుక్ చేసుకుని పలు కారణాలతో రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి ఆ ఛార్జీలను తిరిగి చెల్లిస్తాం. టోల్ ఫ్రీ నెంబర్ 17న ప్రకటించాం. ఆగస్టు 18నుంచి కాల్స్ తీసుకున్నాం. టోల్ ఫ్రీ నెంబర్లను 20కి పెంచాం. మొదటిరోజు 116 కాల్స్ వచ్చాయి. 19న 168, 20న 200 కాల్స్, 21వ తేదీన 360 కాల్స్, 22న 309 కాల్స్ వచ్చాయి. దాదాపు 1162 కాల్స్ లో అగ్రికల్చర్ ల్యాండ్ కు సంబంధించి 614, నాన్ అగ్రికల్చర్ భూముల కోసం 547 కాల్స్ వచ్చాయి. ఈ కాల్స్ లో ఓవర్ లాప్ కాల్స్, రిపీటెడ్ తీసివేస్తే 980 కాల్స్ రాగా.. అగ్రికల్చర్ భూమలకు 547, నాన్ అగ్రికల్చర్ కు సంబంధించి 433 కాల్స్ వచ్చాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 258 కాల్స్, మేడ్చల్ 149, సంగారెడ్డిలో 82, కామారెడ్డిలో 44, భువనగిరిలో 40 కాల్స్ సహా ఇతర జిల్లాల నుంచి కూడా టోల్ ఫ్రీ నెంబర్ కు వచ్చాయి. వీటిలో ప్రభుత్వ భూములు కాకుండా, జెన్యూన్ భూముల రిజిస్ట్రేషన్‌ను 24గంటల నుంచి 36గంటల్లో పరిష్కరిస్తాం. భవిష్యత్తులోనూ ఫాస్ట్‌ట్రాక్‌లో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్య పరిష్కరిస్తాం. సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన భూముల జాబితా ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ సమస్య లేకుండా చేస్తామని’ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.కొందరు ప్రస్తుత పరిస్థితిని అడ్డం పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసుందుకు దొంగ జీవోలు విడుల చేస్తున్నారని మంత్రి పొంగులేటి తెలిపారు. 2204, 2026 తేదీన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ సంతకం చేశారని, మాకు ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడం లేదని దొంగ జీవో, డాక్యుమెంట్స్ క్రియేట్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పలు జిల్లాల్లో ఇలాంటి ఫేక్ డాక్యుమెంట్స్, ఫేక్ లెటర్లు, ఫేక్ జీవో పేపర్లు వైరల్ చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఫేక్ జీవోలు, డాక్యుమెంట్లు తయారుచేసినట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ భూములను పరిరక్షించాలి..
## అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు**




తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు అక్రమ ఆక్రమణలు, కట్టడాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమంలో అడ్వకేట్ పడాల శ్రీనివాస్ తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పోడిల రవికుమార్, ఎంపీడీవో, నోడల్ అధికారి లెంకల గీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడ్వకేట్ పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తుర్కపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు అత్యంత పరిమితంగా ఉన్నందున వాటిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విలువైన ప్రభుత్వ భూములను ఎవరూ ఆక్రమించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన బేస్‌మెంట్ స్థాయి నిర్మాణాన్ని కోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే సునీత మహేందర్ రెడ్డి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాంగణంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆ ప్రతిపాదన పరిస్థితి ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని కోరారు. ప్రభుత్వం ఏదైనా కమ్యూనిటీకి బీసీ కమ్యూనిటీ హాల్ కేటాయించే పక్షంలో మున్నూరుకాపు కమ్యూనిటీకి కూడా సమానంగా అవకాశం కల్పించాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూముల విషయంలో ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.




## 6 లక్షల చెక్కుల పంపిణీ

**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి VB GRAM G పథకంలో భాగంగా పండ్ల తోటలకు సంబందించిన 6 లక్షల చెక్కులను గ్రామపంచాయతీ ఆవరణలో రైతులకు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పథకం సన్న కారు చిన్న కారు రైతులకు ఇది ఒక వరం లాంటిది ఈ పథకాన్ని గ్రామంలో ఉన్నటువంటి రైతులందరూ ఉపయోగించుకొని గ్రామ అభివృద్ధికి, ఆర్థిక వ్యవస్థ కి బలం చేకూరుతుందని తెలియజేయడం జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని, చెక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. మన గ్రామాన్ని, మన పరిసరాలను పచ్చని చెట్లతో కళకళలాడేలా చేయాలి. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ వార్డు సభ్యులు రైతులు పాల్గొన్నారు.

## పంచకర్లకు ధన్యవాదాలు

- తాడి కూటమి నాయకులు

**జయభేరి, పరవాడ:**



ఎన్నో ఏళ్ళుగా తమ గ్రామాన్ని తరలించాలంటూ కోరుతున్న తాడి ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకొని తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలంటూ ఇప్పటికి మూడుసార్లు అసెంబ్లీలో ప్రస్తావించి తమ సమస్యను పరిష్కరించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు సోమవారం తాడి కూటమి నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. సుజాతనగర్ లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ తాను ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి నూటికి నూరు శాతం పని చేస్తున్నానని, అయితే కొన్ని అనివార్య కారణాల వలన కొంత ఆలస్యం అవ్వచ్చు గాని, ప్రతి సమస్య పరిష్కారం అవ్వడం ఖాయమని అన్నారు. వారం రోజుల్లోగా స్థానిక రెవిన్యూ సిబ్బందితో తాను వచ్చి తాడి తరలింపుకు అనువైన పెదముసలివాడ వద్ద గల స్థలాన్ని పరిశీలిస్తానని వారికి హామీ ఇచ్చారు. త్వరలోనే మంచి ముహూర్తం చూసి తరలింపుకు అనువైన స్థలంలో లేఅవుట్ సిద్ధం చేసేందుకు శంకుస్థాపన కూడా చేస్తాను అన్నారు.
పంచకర్ల రమేష్ బాబుపై తాము పెట్టుకున్న నమ్మకం నిజమైందని అన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, కోమటి సూరిబాబు, మాజీ ఉపసర్పంచ్ గొల్లవిల్లి నాగరాజు, సాలాపు రమణ, దానబోయిన నీలకంఠరావు, ముమ్మన సూరి అప్పారావు, యర్రా నరేష్, పరమటయ్య, మేడిశెట్టి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు సంవృద్ధిగా కురువాలని రైతులు బాగుపడలని పాండవుల బండ దగ్గర వరద పాశం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం మైనంపల్లి ఆవరణలో వర్షాలు సంవృద్ధిగా కురువాలని రైతులు బాగుపడలని ఈనెల 30వ తేదీన ఆదివారం ఉమ్మడి మైనంపల్లి గ్రామాలకి చెందిన రైతులు.గ్రామస్తులు. అందరూ కలిసి పాండవుల బండ దగ్గర వరద పాశం పోసి గ్రామదేవతలకు పూజలు చేయుటకు నిర్ణయం తీసుకున్నట్లు మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ తెలిపారు. మైనంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో అంబటి వాని గూడెం సర్పంచ్ హరికృష్ణ. శకృతండా సర్పంచ్ మోహన్ లాల్, అన్ని గ్రామాల పెద్దమనుషులు అందరూ కలిసి నిర్ణయం తీసుకున్నారు.పాల్గొన్న అన్ని గ్రామాల పెద్దమనుషులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీల్లో తొలిగిన తాగునీటి సమస్య

- జనసేన మండల ఉపాధ్యక్షులు నర్సింహారవు చొరవతో తొలిగిన నీటి కష్టాలు
- మోటార్ రిపేర్ పనులను దగ్గరుండి పర్యవేక్షించిన జనసేన మండల ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు

**జయభేరి, పరవాడ:**



అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వెన్నలపాలెం గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలనీల్లో గత వారం రోజులుగా తాగునీరు అందక స్థానిక ప్రజలు పడుతున్న అవస్థలపై జనసేన, టిడిపి నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది తక్షణమే స్పందించారు.
ఈ సమస్య తీవ్రతను తెలుసుకున్న జనసేన మండల పార్టీ ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు, గ్రామ టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం జగనన్న కాలనీకి ప్రత్యేకంగా మోటార్ మెకానిక్‌ను రప్పించి పాడుబడిన మోటార్‌ను రిపేర్ చేయించారు. ఈ పనులన్నింటినీ వెన్నెల నరసింహారావు స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. తాగునీటి సమస్య తీరడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకుని, తక్షణమే స్పందించిన నాయకులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెన్నెలపాలెం గ్రామ సెక్రెటరీ రజని, డిజిటల్ అసిస్టెంట్ మురళి,జనసేన మండల పార్టీ ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి బండారు వీరు నాయుడు, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు రొంగలి కళ్యాణ్, నాయకులు పెంద్యాల ప్రసాద్, పెంద్యాల శ్యామ్, పచ్చిపాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల హత్యకేసులో నిందితురాలు ఆత్మహత్య

**జయభేరి, వికారాబాద్ :**

ప్రియుడి మోజులో పడి కన్న తల్లిదండ్రులకు సూది మందులో విషమిచ్చి హత్య చేసిన నర్సు సురేఖ ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారం గ్రామానికి చెందిన సురేఖ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఆత్మహత్య చేసుకుంది. దాంతో సంగారెడ్డి పోలీసులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతురాలు తల్లిదండ్రుల హత్య కేసులో జైలు శిక్షణ అనుభవించి ఈ మధ్యనే బైల్ పై వచ్చింది. బైల్ పై వచ్చినప్పటి నుంచి సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఉంటోంది. సురేఖ మృతికి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




జయభేరి, రాజమండ్రి, ఆగస్టు 24 :

ఆంధ్రప్రదేశ్‌ను కుదిపేసిన పిఠాపురం పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ టి.నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో సోమవారం నాడు అత్యంత కీలకమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ దారుణ బలవన్మరణాలకు ప్రధాన కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు షేక్ సాధిక్ ఖాన్‌ను కాకినాడ సర్పవరం పోలీసులు సోమవారం ఉదయం నుంచి సుదీర్ఘంగా విచారించారు. అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్, ఐదుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఈ విచారణను నిర్వహించింది. విచారణ ప్రక్రియ ముగిసిన వెంటనే నిందితుడిని వైద్య పరీక్షల నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచడానికి పోలీస్‌లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 16వ తేదీన పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య కలిసి రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నూకరాజు, మీనా, సౌజన్య ముగ్గురూ నదిలో ప్రాణాలు కోల్పోయారు. అయితే నూకరాజు పదేళ్ల మనుమడు,సౌజన్య కుమారుడైన రియాన్ష్ కార్తికేయ రెడ్డికు ఈత రావడంతో అతడు గోదావరి ప్రవాహం నుంచి మృత్యుంజయంగా ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ లోగా నదిలో లభ్యమైన మీనా మృతదేహం తీవ్రంగా కుళ్లిపోయి, పాడైపోవడంతో బంధువులు శనివారం నాడు ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం నాడు పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం, మృతదేహం కాకినాడను తరలించే పరిస్థితి లేకపోవడంతో ధవళేశ్వరంలోని శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కేసులో అసలు మలుపు నూకరాజు కుమార్తె సౌజన్య రాసిందనే చెబుతున్న ఐదు పేజీల లేఖ వైరల్ అవుతుంది. ఈ లేఖలో సౌజన్య తనపై సాధిక్ ఖాన్ సాగించిన అమానవీయ హింస, బ్లాక్‌మెయిల్, ఆస్తి దోపిడీ, మతమార్పిడి ఒత్తిళ్లను వివరించింది. తాము 2018లో బెస్ట్ ఫ్రెండ్ తన తమ్ముడైన సతీష్‌ను కోల్పోయామని సౌజన్య భావోద్వేగంగా రాసింది. ఆ తర్వాత తనకు వివాహం జరిగి కొడుకు రియాన్ష్ పుట్టాడని తెలిపింది. అయితే తన భర్త తమను ఎక్కడికీ పంపేవాడు కాదని, కేవలం రావులపాలెంలో జరిగిన ఫంక్షన్లకు మాత్రమే తీసుకెళ్లేవాడని పేర్కొంది. దీని వల్ల కొడుకు రియో తీవ్ర ఒంటరితనానకి గురికవడంతో గత రెండేళ్లూ తానే స్వయంగా కాకిడనాడలో కొడుకును బయటకు తీసుకెళ్తూ ప్రపంచాన్ని పరిచయం చేసేందుకు తిప్పానని వివరించింది. ఈ క్రమంలోనే సాధిక్ అనే వ్యక్తి కొడుకు రియోకు పరిచయం అయ్యాడు. రియోతో ఆడుకుంటూ, అతిని ఎంటర్‌టైన్ చూస్తేనే తమ ఇల్లు, కుటుంబ పరిస్థితులు, తన భర్త ఇంట్లో ఎక్కువగా ఉండరనే వ్యక్తిగత విషయాలను సాధిక్ ఆతీతీశాడు. ఒక అకాడమిక్ క్లాస్ సమయంలో సౌజన్య ఒక లాయర్ కోసం చూస్తున్నట్టు ఫోన్‌లో మాట్లాతుండగా విన్న సాధిక్, నెమ్మగా స్నేహం పేరిట దగ్గరయ్యాడు. తాను అన్ని విధాలా సపోర్ట్ ఇస్తానంటూ ఆమె నమ్మకాన్ని పొందాడు. నమ్మకంగా నటించిన సాధిక్, కొన్ని ప్రైవేట్ విషయాలను అడ్డుపెట్టుకొని సౌజన్యను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. దీని ఆమె ఎదిరించిన ప్రతిసారీ విచక్షణారహితంగా భౌతికంగా దాడి చేస్తూ కొట్టేవాడు. భయాందోళల వల్ల ఆమె తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. చనిపోవాలని చాలాసార్లు భావించినా కొడుకు రియోను చూసి ఆగిపోయింది. ఈ ఏడాది కాలంపాటు ఈ నరకాన్ని భరించిన తర్వాత ఆమె తన భర్తకు అసలు విషయం చెప్పింది. " నా ఆస్తి మొత్తం నీకే ఇస్తేసా, నువ్వు కోరిన విడాకులు ఇస్తాను, నన్ను ఈ సాధిక్ నుంచి కాపాడు" అని భర్తను వేడుకుంది. కానీ ఆమె భర్త సాధిక్ వద్దకు వెళ్లగా, తన మనుషులతో ఆయనను కూడా కొట్టించడంతో ఆయన తీవ్రంగా భయపడిపోయారు. సాధిక్ ఇంతటితో ఆగకుండా, కొడుకు రియో చదువుతున్న స్కూల్ లో కోచ్‌గా చేరి, ఏదైనా తేడా వస్తే బాబును కిడ్నాప్ చేస్తనని బెదిరించాడు. చనిపోవడానికి కూడా వీలు లేకుండా అన్నీ మార్గాలను మూసివేశాడు. చివరకు సౌజన్య భర్త జగీశ్వర్ రెడ్డిని అత్యంత ప్రమాదకరమైన ఆరోపించింది. దీనిపై సాధిక్ కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి మొర పెట్టుకుంటే, వారు కూడా సాధిక్‌కు దూరంగా జాగ్రత్తగా ఉండాలని మాత్రమే హెచ్చరించారని వాపోయింది. తన ఆస్తిపై కన్నేసిన సాధిక్, తమ్ముడిని కోల్పోయిన పుట్టెడు దుఃఖంలో ఉన్న తనను బలవంతంగా ఇస్లాం మతంలోకి మారాలని తీవ్ర చిత్రహింసలకు గురి చేశారని సౌజన్య ఆవేదన వ్యక్తం చేసింది. చివరికి వేధింపులు తట్టుకోలేక కుటుంబం మొత్తానికి ఆత్మహత్యే శరణ్యమైందని తన లేఖలో ముగించుకుంది. ఈ ఐదు పేజీల లేఖ ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు వేగవంతం చేశారు.

**బాధితులను పరామర్శించిన విజయసాయిరెడ్డి**

ఈ విషాద ఘటనపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తీవ్రంగా స్పందించారు. రావులపాలెంలోని మృతుడు జగదీశ్వర్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ ఈ ఘోరం నుంచి ప్రాణాలతో బయటపడిన పదేళ్ల బాలుడిని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. బాలుడి చదువుకు అయ్యే ఖర్చు భరిస్తానని చెప్పారు. బాధితులను పరామర్శించిన తర్వాత విజయసాయి రెడ్డి మీడియా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. నూకరాజు కుటుంబానికి చెందిన ఆస్తులను, బ్యాంకు లాకర్లను సాధిక్ రాయించుకున్నాడని ఆరోపించారు. బాధితుల వద్ద రెండు కోట్ల విలువైన బంగారం, రెండు కోట్ల నగదు, రావులపాలెంలో పది కోట్ల విలువైన భూమి, కాకినాడలోని మరో స్థలం, జగదీశ్వర రెడ్డికి సంబంధించిన ఇన్సూరెన్స్ క్లెయిమ్ సొమ్మును కూడా సాధిక్ లాక్కున్నాడని ఆరోపించారు. కెనడా నుంచి ముంబైకి తీసుకు వచ్చిన అత్యంత ప్రమాదకరమైన స్లో పాయిజన్ కెమికల్‌ను జగదీశ్వర రెడ్డికి ఇచ్చి చంపేశారని అన్నారు. హిందూ సమాజానికి చెందిన రెడ్డి, బీసీ కుటుంబాలను టార్గెట్‌గా సాగిన అకృత్యంగా తెలిపారు. సౌజన్యను ఇస్లాం మతంలోకి మార్చడానికి చిత్రవధ చేశారని అన్నారు. ఇది ఒక రకమైన లవ్‌జిహాద్ తరహా వ్యవహారమని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో సాధిక్ వంటి ముఠాలు అనేకం చురుగ్గా ఉన్నాయని హెచ్చరించారు. ఈ దారుణ ఘటనపై అధికార కూటమి, ప్రతిపక్షాలు మౌనంగా ఉండటంపై విజయసాయిరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సౌజన్య రాసిన ఐదు పేజీల లేఖను ఎక్స్‌లో పోస్టు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం మౌనం వహించవద్దని హితవు పలికారు. మతమార్పిడి నిరోధక బిల్లును తీసుకురావడానికి సీఎం చంద్రబాబు ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. తాను అధికారంలో ఉండి ఉంటే ఉత్తర్‌ప్రదేశ్ తరహా ట్రీట్మెంట్ ఇక్కడ అమలు చేసేవాడినని చెప్పారు



# 528.58 చదరపు అడుగుల్లో ఇందిరమ్మ ఇళ్లు

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 24 :

హైదరాబాద్ క్యూర్ పరిధిలో పేదల కోసం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్లకు నిర్మాణ అనుమతుల ప్రక్రియ ప్రారంభమైంది. సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ అనంతరం గృహ నిర్మాణ సంస్థ అధికారులు జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలకు దరఖాస్తులు సమర్పించారు. ఆయా భూముల పత్రాలను చీఫ్ సిటీ ప్లానర్లు పరిశీలిస్తున్నారు. క్యూర్ పరిధిలో 16 ప్రాంతాల్లో తొమ్మిది, పది అంతస్తుల టవర్లుగా 7,680 ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఫ్లాట్ కామన్ ఏరియాతో కలిపి 528.58 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణ ప్రక్రియ వేగం పుంజుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలో భూమిపూజ నిర్వహించడంతో నిర్మాణానికి సంబంధించిన తదుపరి కార్యాచరణ ప్రారంభమైంది. ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి అవసరమైన అనుమతుల కోసం గృహ నిర్మాణ సంస్థ అధికారులు జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ నగరపాలక సంస్థ, మల్కాజిగిరి నగరపాలక సంస్థలకు దరఖాస్తులు సమర్పించారు.ప్రాజెక్టుకు సంబంధించిన భూముల యాజమాన్య హక్కులు, పత్రాలు, నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలించి అనుమతులు జారీ చేయాలని ఆయా కార్పొరేషన్ల కమిషనర్లు టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు చీఫ్ సిటీ ప్లానర్లు ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత పత్రాల పరిశీలన ప్రారంభమైంది. టవర్ల రూపంలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించనున్నందున ఒక్కో టవర్‌కు విడిగా నిర్మాణ అనుమతులు మంజూరు చేసే విధానాన్ని అధికారులు అనుసరించనున్నారు.జీహెచ్‌ఎంసీ పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 11 ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 10 ప్రాంతాల్లో 4,320 ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ పూర్తయింది. మరోవైపు సీఎంసీ పరిధిలోని నాలుగు, ఎంఎంసీ పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన దరఖాస్తులు కూడా సమర్పించినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. భూముల అందుబాటు, నిర్మాణ అనుమతులు, సాంకేతిక పరిశీలనలు వంటి ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి పనులను దశలవారీగా ప్రారంభించనున్నారు. క్యూర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో మొత్తం 16 ప్రాంతాల్లో 7,680 ఇళ్లను ప్రభుత్వం నిర్మించనుంది. వీటిని తొమ్మిది, పది అంతస్తుల టవర్ల రూపంలో నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూములను సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా చూస్తే.. రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో 480, మహేశ్వరం పరిధిలోని జల్‌పల్లిలో 480, ఖైరతాబాద్‌లో హకీంపేట్ దర్గా వద్ద 120, నాంపల్లిలోని రెడ్‌హిల్‌స్‌లో 360, అదే ప్రాంతంలోని నిలోఫర్ సమీపంలో 120, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ సమీపంలో 360, కార్వాన్‌లోని కుల్సుంపురలో 480, బహదూర్‌పురలోని నందిముస్లాయిగూడలో 480 ఇళ్లు నిర్మించనున్నారు. అలాగే సనత్‌నగర్ పాటిగడ్డలో 480, అంబర్‌పేట్ సిటీ పోలీస్ లైన్స్‌లో 480, మలక్‌పేట్ గడ్డిఅన్నారం ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్‌లో 480, శేరిలింగంపల్లి రాయదుర్గంలో 480, ఇబ్రహీంపట్నం బండ్లగూడ ఎల్‌ఐజీ కాలనీ వద్ద 480, మల్కాజిగిరి కౌకూర్‌లో 480, కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో 480, మేడ్చల్ పోచారం ఎల్‌ఐజీ కాలనీలో 480, గాజులరామారంలో 480, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోయిన్‌పల్లిలో 140 ఇళ్లను నిర్మించనున్నట్లు ప్రణాళికలో ఉంది. డిజైన్ల ప్రకారం ఒక్కో ఫ్లాట్ సాధారణ ప్రాంతాలను కలుపుకొని 528.58 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంటుంది. బహుళ అంతస్తుల టవర్లలో నిర్మించనున్న ఈ ఇళ్లలో ప్రాథమిక సౌకర్యాలు, కామన్ ఏరియాలను కూడా ప్రణాళికలో భాగంగా చేర్చారు.

# సెక్రటేరియట్‌లో సోలార్ కార్ పార్కింగ్

- డిసెంబరులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశం

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 24 :

తెలంగాణ సెక్రటేరియట్ లో రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సోలార్ కార్ పార్కింగ్ వ్యవస్థ పనులను డిసెంబరు నాటికి పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్తర భాగంలో రెండు, దక్షిణంలో మూడు, పశ్చిమంలో ఒక వరుసగా సోలార్ ప్యానెళ్లతో షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా సుమారు 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి, సెక్రటేరియట్ నెలవారీ విద్యుత్ బిల్లులో 16 శాతం వరకు ఆదా చేయవచ్చని మంత్రి తెలిపారు. నార్కెట్‌పల్లి వంతెన పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ సెక్రటేరియట్‌లో విద్యుత్ ఆదాతో పాటు పర్యావరణహిత మౌలిక వసతులను పెంచే దిశగా సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సోలార్ కార్ పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనుండగా.. ఈ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్ ప్రాంగణంలోని కార్ పార్కింగ్ ప్రాంతాల్లో సోలార్ ప్యానెళ్లతో కూడిన షెడ్లను ఏర్పాటు చేయడం ద్వారా ఒకేసారి వాహనాల పార్కింగ్, విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నారు.సెక్రటేరియట్‌లో శనివారం ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. సోలార్ కారు పార్కింగ్, సీఆర్‌ఐఎఫ్ పనులు, వివిధ వంతెనల నిర్మాణ పురోగతిపై అధికారులతో చర్చించారు. సోలార్ పార్కింగ్ ప్రాజెక్టు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకుండా, సమన్వయంతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. సోలార్ పార్కింగ్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే సెక్రటేరియట్‌కు అవసరమైన విద్యుత్‌లో ఎక్కువ శాతం అక్కడే ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా సుమారు 90 వేల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చునని మంత్రి వెల్లడించారు. ఫలితంగా సెక్రటేరియట్ నెలవారీ విద్యుత్ బిల్లులో దాదాపు 16 శాతం వరకు ఆదా అయ్యే ఛాన్సుందన్నారు. ప్రభుత్వ భవనాల్లో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచే చర్యల్లో భాగంగా ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.సెక్రటేరియట్ ఉత్తర భాగంలో రెండు వరుసలు, దక్షిణ భాగంలో మూడు వరుసలు, పశ్చిమ భాగంలో ఒక వరుసగా సోలార్ ప్యానెళ్లతో కూడిన కార్ పార్కింగ్ షెడ్లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. అందుకు సంబంధించిన డిజైన్లు, నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పార్కింగ్ సదుపాయం మెరుగుపడటంతో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తి జరిగేలా నిర్మాణాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.




# ఈగల్ శాఖలో ఇంటి దొంగల బాగోతం

- డ్రగ్స్ పెడ్లర్లతో కలిసి


జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేసే ఈగల్ శాఖలోనే ఇద్దరు కానిస్టేబుల్స్ డ్రగ్స్ దందాకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈగల్ ఇంటి దొంగలైన కానిస్టేబుల్ నరహరి, స్వామిలపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.50 లక్షలు విలువైన ఎక్ససీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్న కానిస్టేబుల్స్, దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వనట్లు తెలుస్తోంది. 50 లక్షల విలువైన ఒక కిలో ఎక్ససీ మాత్రలను అక్రమంగా విక్రయించేందుకు వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఏకంగా డ్రగ్ పెడ్లర్లను సంప్రదించినట్లు సమాచారం. ఒక డ్రగ్ పెడ్లర్‌ను పట్టుకునేందుకు హెచ్‌న్యూ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో.. కానిస్టేబుళ్లు నరహరి, స్వామిల బాగోతం బట్టబయలైంది. గతంలో వీరిద్దరూ పలు విజయవంతమైన యాంటీ డ్రగ్స్ ఆపరేషన్స్ చేసి అవార్డులు కూడా అందుకున్నారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ఈగల్ టీం.. ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి దూరం పెట్టినట్లు తెలుస్తోంది. నరహరి, స్వామిలపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు
సమాచారం. డ్రగ్స్ పెడ్లర్లతో వీరికి ఉన్న సంబంధాలు, ఎక్ససీ మాత్రలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఈగల్ శాఖలో మరెవరైనా ఇందులో భాగస్వాములై ఉన్నారా అనే కోణంలో ఈగల్ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**వరంగల్‌లో 120 కిలోల గంజాయి పట్టివేత?**

వరంగల్ జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. దాదాపు 120 కిలోల గంజాయిని కారులో రవాణా చేస్తున్న ఇద్దరిని వర్ధన్నపేటలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు గంజాయిని ఒడిశా నుంచి కేరళకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిని గంజాయి విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులు రవాణాకు ఉపయోగించిన కారు త్రిపుర రాష్ట్రానికి చెందినదిగా గుర్తించారు. 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. గంజాయి రవాణాకు ఇంకెవరైనా సహకరించారా అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.






- వామపక్ష ఉద్యమానికి, రైతాంగ పోరాటానికి తీరని లోటు : సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ

జయభేరి, హైదరాబాద్:

సిపిఎం సీనియర్ నాయకులు, అఖిల భారత కిసాన్ సభ సీనియర్ నేత, రైతాంగ ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం వామపక్ష ఉద్యమానికి, తెలంగాణ రైతాంగ పోరాటానికి తీరని లోటని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఆయన మరణం పట్ల పార్టీ తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ, కామ్రేడ్ మల్లారెడ్డికి విప్లవ జోహార్లు అర్పించింది. ఆయన కుటుంబ సభ్యులకు, సహచరులకు, సిపిఎం శ్రేణులకు, రైతు ఉద్యమ కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. దశాబ్దాలుగా రైతాంగ సమస్యలను తన రాజకీయ జీవితంలో ప్రధాన అంశంగా చేసుకుని పనిచేసిన కామ్రేడ్ మల్లారెడ్డి రైతుల భూమి, సాగునీరు, గిట్టుబాటు ధర, పంటల మార్కెటింగ్, రుణభారం, పంట నష్టపరిహారం వంటి సమస్యలపై నిరంతరం పోరాడారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం తక్షణ ఉపశమన చర్యల కోణంలో కాకుండా, వ్యవసాయ రంగంలో పెరుగుతున్న కార్పొరేటీకరణ, మార్కెట్ ఆధిపత్యం, ప్రభుత్వ విధానాలతో అనుసంధానించి చూడాల్సిన అవసరాన్ని ఆయన తన ఉద్యమ కార్యాచరణలో పదేపదే ముందుకు తెచ్చారు.

**రైతు ఉద్యమ నిర్మాణానికి అంకితమైన జీవితం**

తెలంగాణ రైతు సంఘం, అఖిల భారత కిసాన్ సభలతో అనుబంధంగా సుదీర్ఘకాలం పనిచేసిన మల్లారెడ్డి రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. స్థానిక భూ సమస్యలపై రైతు సంఘాలు కేంద్రీకరించాలని, మారుతున్న వ్యవసాయ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు కార్యకర్తలు అధ్యయనం పెంచుకోవాలని ఆయన ఇటీవల కూడా పిలుపునిచ్చారు. రైతు ఉద్యమం కేవలం పంట ధరల సమస్యకే పరిమితం కాదని, భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ పెట్టుబడులు, మార్కెట్ హామీ, ప్రభుత్వ మద్దతు వంటి అనేక అంశాలతో రైతుల జీవితం ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేసేవారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలంటే ముందుగా మార్కెట్ హామీ కల్పించాలని ఆయన చేసిన సూచనలు రైతాంగ సమస్యలపై ఆయనకున్న లోతైన అవగాహనకు నిదర్శనం.

**రైతుల పక్షాన నిరంతర గళం**

రైతుల పంటలకు గిట్టుబాటు ధర, పంట నష్ట పరిహారం, రుణ విముక్తి వంటి డిమాండ్లపై మల్లారెడ్డి నిరంతరం ప్రభుత్వాలను ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించేందుకు రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతుల ఆదాయం, పంటల మార్కెటింగ్, కేంద్ర రాష్ట్రప్రభుత్వాల విధానాలపై ఆయన నిరంతరం విమర్శనాత్మకంగా మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని కూడా ఆయన బలంగా ప్రతిపాదించారు. తెలంగాణ రైతాంగ పోరాటం కుల, మతాలకు అతీతంగా భూస్వామ్య నిరంకుశ అణచివేతకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటమని ఆయన వివరించారు. ఈ అంశంపై ఆయన రచించిన “తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రచారాలు, వాస్తవాలు” వంటి రచనలు కూడా అందుబాటులో ఉన్నాయి.



మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ
7893230218

**వామపక్ష ఐక్యతకు స్ఫూర్తిదాయకమైన నాయకత్వం**

కామ్రేడ్ మల్లారెడ్డి వ్యక్తిగత జీవితాన్ని ప్రజా ఉద్యమానికి అంకితం చేసిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు. రైతాంగ ఉద్యమంలో అనేక తరాల కార్యకర్తలను తీర్చిదిద్దడంలో, ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్మించడంలో ఆయన పాత్ర ఉంది. ఇటీవల కూడా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలలో ఆయన సీనియర్ నాయకుడిగా పాల్గొన్నారు. ఆయన మరణం ఒక వ్యక్తి కోల్పోవడమే కాదు; రైతాంగ ఉద్యమంలో అనుభవం, అధ్యయనం, పోరాట నిబద్ధత కలిగిన ఒక తరాన్ని కోల్పోవడమేనని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ, రైతాంగ సమస్యలపై మరింత బలమైన పోరాటాలను నిర్మించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. భూమి, భుక్తి, విముక్తి కోసం, రైతు కూలీ ఐక్యత కోసం, దోపిడీ రహిత సమాజం కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పార్టీ పిలుపునిచ్చింది.

**కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు! ఆయన పోరాట స్ఫూర్తికి జోహార్లు!**

# గత సీజన్ మిస్ అయ్యింది: ఈసారి మాత్రం పక్కా!




బుల్లితెర ప్రేక్షకుల ఫేవరెట్ టీవీ రియాలిటీ షో బిగ్ బాస్ కొత్త సీజన్ ప్రారంభోత్సవానికి కౌంట్ డౌన్ మొదలైంది. ఈసారి తెలుగుతో పాటు హిందీ, కన్నడం, తమిళం, మలయాళం తదితర భాషల్లో ఒకేసారి బిగ్ బాస్ గ్రాండ్ లాంఛింగ్ ఉండనుంద. ఇక తెలుగులో పదో సీజన్ కావడంతో ఈసారి ఈ రియాలిటీ షోపై భారీ అంచనాలు ఉన్నాయి. కంటెస్టెంట్ల ఎంపిక మొదలు గేమ్స్, టాస్కుల నిర్వహణలో ఈసారి సరికొత్త పద్ధతులు, రూల్స్ ను అవలంభించనున్నట్లు టాక్. ఈ నేపథ్యంలో బిగ్‌బాస్ తెలుగు 10వ సీజన్ లో కంటెండర్స్ ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. సోషల్ మీడియాలో అయితే చాలా మంది సెలబ్రిటీల పేర్లు వినిపిస్తున్నాయి. పల్లవి గౌడ, తేజస్విని గౌడ, కావ్యశ్రీ, వాసంతి కృష్ణన్ భర్త పవన్ కళ్యాణ్ జబర్దస్త్ ఫేమ్ ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, ఆట సందీప్ భార్య జ్యోతి, నందూస్ వరల్డ్ నందూ, రాయల్ మెక్ రమణ, శివ్, కడలి సత్యనారాయణ ఇలా చాలా మంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఈ లిస్టులో ఓ అందాల యాంకరమ్మ పేరు కూడా చేరింది. ఆమె మరెవరో కాదు వర్షిణీ సౌందర రాజన్. మొన్నటివరకు సినిమాలు, వెబ్ సిరీస్ లు, టీవీ షోలతో బిజీ బిజీగా గడిపింది వర్షిణి. అయితే ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేతిలో పెద్దగా టీవీ షోస్, ప్రోగ్రామ్స్ లేవని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వర్షిణీ బిగ్ బాస్ 10లోకి వెళ్లనుందని గట్టిగా ప్రచారం జరుగుతోంది. సెలబ్రిటీ కేటగిరీ కంటెస్టెంట్ల లిస్టులో వర్షిణి పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఇప్పటికే బిగ్ బాస్ నిర్వాహకులు వర్షిణీని సంప్రదించారని, అందుకు ఆమె కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్. కాగా బిగ్ బాస్ తెలుగు సీజన్ 4 నుంచి దాదాపు ప్రతి సీజన్‌లోనూ వర్షిణి పేరు చర్చకు వచ్చింది. అయితే వివిధ కారణాలతో ఆమె బిగ్‌బాస్ హౌస్‌లోకి రాలేదు. అయితే ఇప్పుడు మాత్రం వర్షిణీ కచ్చితంగా హౌస్ లోకి అడుగు పెట్టనుందని తెలుస్తోంది. కాగా వర్షిణీ యాంకర్ గానే కాకుండా నటిగానూ సత్తా చాటింది. పలు సినిమాలు, వెబ్ సిరీసుల్లోనూ నటించింది. గ్లామర్ పరంగానూ ఈముద్దుగుమ్మకు నెట్టింట మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.



# ఓటీటీలోకి 'కొరియన్ కనకరాజు'!

గత కొన్నేళ్లుగా వరుస ఫ్లాపులతో సతమతమవుతోన్న వరుణ్ తేజ్ కు కొరియన్ కనకరాజు రూపంలో బిగ్ రిలీఫ్ దొరికింది. ఆగస్టు 07న విడుదలైన ఈ కామెడీ హారర్ థ్రిల్లర్ సూపర్ హిట్ గా నిలిచింది. అంచనాలకు మించి వసూళ్లు సాధించి వరుణ్ తేజ్ కెరీర్ లో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీగా నిలిచింది. ఇప్పటివరకు ఈ సినిమాకు రూ. 60 కోట్ల మేర కలెక్షన్లు వచ్చినట్లు తెలుస్తోంది. థియేటర్లలో రిలీజై మూడు వారాలు గడిచినా కొరియన్ కనకరాజు సినిమాకు మంచి కలెక్షన్లు వస్తున్నాయి. మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ సినిమాలో రితికా నాయర్ హీరోయిన్ గా నటించింది. అలాగే కమెడియన్ సత్య ఈ మూవీ సక్సెస్ లో కీ రోల్ పోషించింది. థియేటర్లలో ఆడియెన్స్ కు మంచి థ్రిల్లింగ్ ఎక్స్ పీరియెన్స్ ఇచ్చిన కొరియన్ కనకరాజు ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తున్నాడు. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఇందుకు గానూ సుమారు రూ. 26 కోట్ల డీల్ జరిగినట్లు తెలుస్తోంది. థియేటర్లలో రిలీజైన నాలుగు లేదా ఐదు వారాల తర్వాత ఈ సినిమాను ఓటీటీలోకి తీసుకువచ్చేలా ఈ ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో థియేటర్లలో సూపర్ హిట్ గా నిలిచిన కొరియన్ కనకరాజు ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్ అయినట్లు సమాచారం. సెప్టెంబర్ రెండో వారంలో ఈ మూవీ ఓటీటీలోకి రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతమున్న సమాచారం ప్రకారం వినాయక చవితి కానుకగా సెప్టెంబర్ 10 లేదా 11వ తేదీన కొరియన్ కనకరాజు ఓటీటీలోకి వస్తున్నట్లు టాక్. త్వరలోనే దీనిపై ఓ అధికారిక ప్రకటన రానున్నట్లు సమాచారం. ఇక కొరియన్ కనకరాజు సినిమా విషయానికి వస్తే.. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించాయి. సునీల్, మురళీధర్ గౌడ్, తులసి, బుల్లిరాజు, వీటీవీ గణేష్, మహేష్ ఆచంట తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. తమన్ ఈ సినిమాకు స్వరాలు సమకూర్చారు.

# 1500 మంది డబ్బింగ్ కళాకారులతో ఆడిషన్స్?



ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వచ్చాక డబ్బింగ్ ప్రక్రియ సులభతరమైంది. భాష రానివారి వాయిస్‌ని కూడా నచ్చిన భాషలో స్పష్టంగా వినిపించొచ్చు. ప్రస్తుతం సినిమా వాళ్లంతా డబ్బింగ్ విషయంలో ఏఐని విపరీతంగా వాడేస్తున్నారు. అయితే.. దర్శకధీరుడు రాజమౌళి మాత్రం ఏఐని దూరంగా ఉంచారు. సంభాషణల్లో భావోద్వేగాలు సహజంగా ఉండాలంటే మనుషులతోనే మాట్లాడించడం శ్రేయస్కరమని ఆయన భావిస్తున్నారు. ఇతర భాషల్లో అనువదించే క్రమంలో కూడా ఇదే విధానాన్ని పాటించాలని ఆయన ఫిక్స్ అయ్యారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'వారణాసి' 120 దేశాల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా 50 భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు నిర్మాత కేఎల్ నారాయణ సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సాధ్యమైనంతవరకూ 'వారణాసి'లో ఓన్ వాయిస్‌లే వినిపించేలా రాజమౌళి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒకవేళ ఏ పాత్రకైనా డబ్బింగ్ అవసరమైతే.. ఏఐతో కాకుండా వేరే వ్యక్తితో అయినా డబ్బింగ్ చెప్పించాలని ఆయన గట్టిగా నిర్ణయించారట. అందుకే ప్రస్తుతం 'రియల్ వాయిస్'లను వెతికే పనిలో ఉన్నారట రాజమౌళి. 50 భాషల్లో ఈ సినిమా విడుదల కానున్నది కాబట్టి, ఆయా భాషల్లో పట్టు ఉన్న 1500మంది డబ్బింగ్ కళాకారులతో ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. వారందరినీ పరిశీలించి, మ్యాచ్ అయ్యేవారితో డబ్బింగ్ చెప్పిస్తారన్నమాట. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. కీరవాణి సంగీత దర్శకుడు.



# 'రాకా'లో లేడీ విలన్?

అల్లు అర్జున్ తాజా చిత్రం 'రాకా' నిర్మాణ దశ నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సైన్స్ ఫాంటసీ మూవీలో దీపికా పడుకోన్‌తో పాటు రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ కథానాయికలుగా నటిస్తున్నారని తెలిసింది. కథావిస్తృతి దృష్ట్యా నలుగురు నాయికలకు చోటుందని చెబుతున్నారు. తాజాగా 'రాకా' ప్రపంచంలోకి మలయాళ భామ ఐశ్వర్యలక్ష్మి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. పూర్తి నెగెటివ్ షేడ్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని, కథాగమనంలో కీలకంగా ఉంటుందని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో ప్రెస్టీజియస్ సినిమా కావడం, దర్శకుడు అట్లీ తన పాత్రను తీర్చిదిద్దిన విధానం నచ్చడంతో ఐశ్వర్యలక్ష్మి లేడీ విలన్‌గా కనిపించడానికి ఓకే చెప్పిందని అంటున్నారు. మరి ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన రావాల్సిందే. త్వరలో హైదరాబాద్‌లో 'రాకా' కొత్త షెడ్యూల్ ప్రారంభంకానుంది. ప్రస్తుతం ఐశ్వర్యలక్ష్మి తెలుగులో 'సంబరాల ఏటిగట్టు' చిత్రంలో నాయికగా నటిస్తున్నది.

# 'ధర్మస్థల నియోజకవర్గం' 'న్యాయం చేయరా దేవుడా' పాట రిలీజ్



'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రంలోని 'న్యాయం చేయరా దేవుడా' థియేట్రికల్ వెర్షన్ పాటను ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రబోస్ తనయుడు నంద వనమాలి తో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. మూవింగ్ డ్రీమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహిస్తుండగా, మేరుం భాస్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మహావీర్ యేలేందర్ సంగీతం అందించిన ఈ పాటను ప్రముఖ గాయని సునీత ఉపద్రస్త ఆలపించారు. చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రష్టి వర్మ డ్యాన్స్, కొరియోగ్రఫీ చేశారు. వారాహి మ్యూజిక్ ద్వారా విడుదలైన 'న్యాయం చేయరా దేవుడా' పాటకు మంచి స్పందన లభిస్తోంది. భావోద్వేగభరితమైన ఈ పాట చిత్ర కథాంశానికి అనుగుణంగా ఉండటంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం తెలిపింది. సెప్టెంబర్ 4న థియేటర్లలో 'ధర్మస్థల నియోజకవర్గం' పివిఆర్ ఐనాక్స్ పిక్చర్ ద్వారా విడుదల కానుంది భారీ అంచనాలతో తెరకెక్కుతున్న 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. విడుదలకు సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**